## అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ప్రణయ సంధ్యారాగం

-సయ్యద్ జహీర్ అహ్మద్

ట్రెయిన్‌లో కూర్చున్న నా మనసు ఓ పట్టాన కుదురుగా కూర్చోనివ్వటం లేదు. నా ఆలోచనలన్నీ సాలీడుగూటిలో చిక్కుకున్న ఈగలా రొదపెడుతున్నాయి.

ట్రెయిన్ పాపికొండల మధ్య దూసుకు పోతూంది. ప్రైమ్ మినిస్టర్ ఇంటర్‌వ్యూకోసం జర్నలిస్టుల్లా, ఒక్క జూదగాణ్ణి అయిదారుగురు పోలీసులు చెంపలు వాయించినట్టు పట్టాల మీద ఉత్పన్నమైన శబ్దం.

ట్రెయిన్ కిటికీల గుండా దారిదోపిడీ దొంగలా రివ్వున వీస్తున్న వెచ్చటిగాలి. ప్రయాణం కొందరికి థ్రిల్ అన్పించినా నాకు మాత్రం బక్కచిక్కిన ఫిట్స్‌రోగిలా వణుకుడు స్ఫురిస్తుంది.

రైలు కూతపెట్టినప్పుడల్లా కౌమారంలో భర్తృవియోగాన్ని భరించలేక వితంతువయ్యాననే రోదనలా ఉంది.

నాకా పిచ్చి ఆలోచనలు రేకెత్తించడానికి నాకేమైనా మతివిభ్రమం ఉందని కాదు. రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు నాకెప్పుడూ అలాంటి ఆలోచనలు వచ్చేవి కావు.

వాటికి తలాతోక సంబంధం లేని పోలికలు నా ఇరవై ఏళ్ళ వసంతంలో వీడిన నా జన్మభూమిని ఈరోజు తరించ బోతున్నాను. ఇరవై అయిదేళ్ళ అనంతరం నా బంధాన్ని కలుసుకోబోతున్నాను.

"ఎక్కడికెళ్ళాలి బాబుగారు?" ప్రక్కన ఉన్నతని పెదవి కదిల్చాడు.

"కమలాపురం" అన్నాను.

చాలా రోజులనుండి చూడాలని తపించే నా 'మేరి'ని చూడటానికి కాలం కలిసి రాలేదు.

నేను తలచేది ఒకటైతే జరిగేది ఊహకందనిది. "అందుకేనేవో నా బ్రతుకు వెన్నెలని అమావాస్య పులిమి అందని తార దూరమై పోయింది."

'మేరీ' ఆర్తిగా మంత్రోచ్ఛారణ చేస్తున్న రాజర్షిలా మనసు మారుమూలల్లో వ్యధతో మూలిగింది.

గత స్మృతుల కడలి కెరటాలవలే తీరాలు చేరి సొమ్మసిల్లిన రీతిన చాలా వెనక్కు వెళ్ళిపోయాను.

రూపవతీ... గుణవతీ... సౌందర్యవతీ

పై మూడింట ఏ ఒక్కటీ 'మేరి'లో లేదనడానికి వీలులేదు.

మేరి అందగత్తె కాదని ఋజువు చేస్తే శిరచ్ఛేదానికి సిద్ధమై వారి ముందు మోకరిల్లుతాను.

బహుశా నన్నెవరైనా అందాలపోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించమంటే ఆ పోటీలో మేరి పాల్గొన్నట్టయితే - నేను మాత్రం నిస్సందేహంగా నిస్సంకోచంగా ఎన్నిక చేసేది 'నా' మేరినే.

అప్పుడు మేరీకి పద్దెనిమిదేళ్ళుంటాయి. మిసమిసలాడే పసిమివన్నె మేని ఛాయ. వంపు సొంపులు సోయగం ఒక శిల్పకళాఖండం నుంచి స్వంతం చేసుకున్న సజీవశిల్పం ఆమెది.

నిజంగా - నా హృదయమధంకర మునువలయ వలపన్ని ఝుంకారనాదం ఆలపించుకున్న తొలివలపుల మది తలపుల విరినారి మేరి.

అప్పట్లో ప్రేమనేదిలా ఉంటుందా?

అని ప్రశ్నించుకొని దానికి సమాధానం మనసుకు రాబట్టు కొనే తెలియని వయసునాది. మేమిరువురం ఒకే కాలేజి విద్యార్థులం. అఫ్‌కోర్స్. ఆమె నాకంటే సీనియర్. ఆమె పాటలు చక్కగా పాడుతుంది. కాలేజి యానివర్సరీ ఫంక్షన్ లో 'నైటింగేల్'గా శ్లాఘించబడింది.

ఆమె క్రైస్తవ గీతాన్ని సుమధురంగా రసవత్తరంగా ఆలపిస్తుంది. ఆమె స్వర మాధుర్యాన్ని ఆలకించి అచ్చెరువై చిత్తరువులయ్యేవారు చర్చికి వచ్చేవారు.

అన్నట్టు నాలో ఒక ప్రత్యేకత. ఒక మూడ్‌లో వెళ్ళినపుడు అవలీలగా గీత రచన చేసేవాణ్ణి

నేను పాటలు వ్రాస్తానన్న ప్రస్తావన ప్రిన్సిపాల్ చెవిన బడింధి. కాలేజి యానివర్సరీకి పాటలు వ్రాయమన్నారు. ఆలపించి చూపించమన్నారు.

"వ్రాయడం వరకే సార్ నా బాధ్యత. పాటలు పాడి వినిపించడానికి తగినది కాదు నా గళం. కనుక ఎవరైతే చక్కగా పాడగలరో వారిచేత పాడించండి' అన్నాను.

సీనియర్‌లలో మేరి చాలా చక్కగా పాడుతుందని ఈ పాటికే ప్రిన్సిపాల్‌కు కబురందింది.

నేను వ్రాసిన గీతం మేరితో పాడించారు. మావి చిగురుతిన్న కలకూజిత రవంలా మధురంగా ఉంది.

అప్పుడు మొదలైన మా పరిచయం సాహిత్యానికి, సంగీతానికి. సమన్వయ పరుస్తున్న సంబంధం బలపడింది మా మధ్య.

కాని దారులు వేరైనా 'ప్రేమ' అనే దార్లో పడక తప్పలేదు. పుస్తకాలకోసం తరచూ వాళ్ళింటికి వెళ్ళి రావడం ఆమె కూడా మా ఇంటికి రావడంవల్ల ఇద్దరి మధ్య 'ప్రేమ' చివురించింది.

రోజుకు ఒకసారైనా ఆమెను చూడాలనే తాపత్రయం. ఆమెకూడా నన్ను పలుకరించనిదే మనసు నిలువదన్నట్టు పట్టలేని ఆనందానుభూతి.

మొద్దులిడ ముద్దార ఆమెను దగ్గరికి లాక్కోబోయేంతలో గువ్వపిట్ట లా ఒదిగిపోయింది.

ముద్దుకు అనుగుణంగా ఆ స్పర్శ తాలూకు మధురానుభూతి మా ఇరువురిలో ఏవో తీరని ఊహాతీరాలకు తీసికెళ్ళింది. అప్పుడు తెలిసింది నాకు తొలి ముద్దులో తియ్యదనం.

ఆమె మోకాళ్ళమీద చేతులు కట్టుకొని తలవంచి చంక క్రిందగా క్రీగంటి చూపులు సంధించటం వల్ల ఉన్మత్తుణ్ణయ్యాను.

ఆమె పాదాలచెంత కూర్చొని అలవోక చూపులతో జాలువారిన కాలిపట్టీల మువ్వల్ని గిల్లుతూ...

'మేరీ...' పిలిచాను. నా కళ్ళల్లోకి సూటిగా చూసింది మేరి.

ఆ చూపుల్లో వసంత వీక్షణాలు. చంద్రుని రాకకోసం నిరీక్షించే చకోరంలా. ఆమెకేమైనా చెప్పాలి. ఏదో ఒకటి చెప్పి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేయాలి. మనసులో గందరగోళం.

'మేరీ ఐలవ్యూ... ఐ... ఎడోర్ యూ'. చెప్పి



నేను అక్కడ ఒక్కక్షణం కూడా ఉండదల్చుకోలేదు.

నాలోని భావాన్ని పసిగట్టినట్టు ఆమె చేయి నా భుజాన్ని పత్తి పట్టుకోవడంతో పావురాయి రెక్కలా అనుభూతి కలిగింది.

చిర్నవ్వు భాసించే పెదాలపై ప్రకంపన సమాధానమైంది. సహస్ర స్త్రీల సిగ్గుముఖాలు ఆమె ముఖంలో ఫలిస్తూ...

'ఐ లవ్యూ టూ..." అంది నెమ్మదిగా.

"ఒరే సలీం ఎంత అదృష్టం చేసి ఉంటే నీకీ ప్రేయసి దొరకురా! మేరి హృదయంలో స్థానం పొందగలిగావంటే నీ అంతటి అదృష్టవంతుడు భూ ప్రపంచంలోనే లేరురా నీ జన్మ సార్థకమైనట్టే రా' మనసు ఉవ్విళ్ళూరింది. నా తనువులో అణువణువున మేరి అని నా సమస్తం మేరి. ఆమె సర్వస్వం నేను.

మత ప్రసక్తి తలెత్త లేదు. నాకంటే ఓ రెండేళ్ళు పెద్దదైనా వయసు ప్రశ్న తలెత్తలేదు. ప్రేమ మత్తులో మునిగిపోయాంకదా!

కాలం క్యాండిల్‌లా కరిగిపోయింది. కాలేజి స్టడీ పూర్తయింది మేరికి. నేనింకా ఒక సంవత్సరం చదివేలోపు ఆమె ఉద్యోగం చేయడమో ఇంకా ఇంకా పై చదువులకు పోవచ్చునేమోనన్న నా ఆలోచనలు తలకిందులయ్యాయి.

మేరి కాలేజికెళ్ళి చదువనూ లేదు. ఉద్యోగం చేయనూ లేదు. ఇంటి దగ్గరే ఉండిపోయింది. నాకు వాళ్ళింటికి వెళ్ళటానికి మనసొప్పలేదు.

మొదటి వారంలో రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళి వచ్చేవాణ్ణి. మత సంబంధమైన టూర్‌కు వెళ్ళవలసిన తల్లిదండ్రులకు కొన్నాళ్ళ పాటు మేరి వాళ్ళ అన్నయ్య జాన్‌తో ఉండవలసి వచ్చింది.

ఒక్కొక్కప్పుడు 'నా మేరి' ఏం చేస్తుందోనని తలుపుచాటు తొంగిచూస్తుంటే 'భౌ' మంటూ హడలెత్తించేది... పసిపిల్ల చేష్టలను కునేవాణ్ణి.

ఒక్కొక్కసారి ఆమెను దగ్గరికి తీసుకోవాలని ఎంత ప్రయత్నించినా 'తప్పు సలీం! అలాంటి వాటికి దూరంగా ఉందాం. కాలం కలిసొచ్చాక జీవిత భాగస్వాములవు దాం. అపుడు మనిష్టారాజ్యం' అంటుంటే ఆమె ఆకాశామంత ఎత్తుకు ఎదిగి పోయిందన్న ఫీలింగ్ నాలో.

అవును మేరీ! నువ్వు నా దానివే నేను నీ వాడినే. భగవంతుడు ప్రత్యక్షమై "ఏం కావాలో కోరుకో' అనడిగితే 'ప్రభూ! సిరిపందలు నాకొద్దు. నేను ప్రేమించే మేరి నన్ను ప్రేమించే మేరితో ప్రేమైక్య జీవితాన్ని ప్రసాదించు' అని కోరుకునేవాణ్ణి.

ఒకరోజు ఎంతకి కంటిమీద కునుకు పట్టలేదు. కారణం మేరినే. ఎలాపడుతుంది? తలపుల్లో అస్తమానం ఆమె నిండిఉంది. కనులు తెరిచినా మూసినా ఆమె రూపం నేనెంత గాఢంగా ప్రేమిస్తున్నానో ఆ విషయం అమ్మకు చెప్పాను.

'ఆ పిల్ల ధ్యాసలో పడిచదువు గంగలో కలిపేసేలా ఉన్నావు' అంది.

నేనామె మాటలను పట్టించుకోలేదు.

మేరీని ఎలాగైనా ఆ రాత్రి చూడాలనే తపన

నాలో ఎక్కువైంది. నిద్రవచ్చి చస్తే కదా! అటు చూస్తే గోడగడియారం పదకొండుకొట్టింది.

అమ్మకు టీ త్రాగి వస్తానని చెప్పి బయట పడ్డాను. అప్పటికే అక్కడక్కడ జనాలు నిద్రలో జారుకున్నారు. మేరీ ఇంటిదాక ఎప్పుడు వచ్చానో నాకే తెలియదు.

అర్ధరాత్రి వేళ మేరీ ఇంట్లో ఎలా ప్రవేశించాలి? పగలైతే పని కల్పించుకొని వెళ్ళడానికి వీలవుతుంది. అర్ధరాత్రి వేళ. అనుభవమున్న సాధారణ దొంగలా... ఊహించుకొని... ఊహించుకున్నంత ఆచరణలో కాంపౌండుగోడ ఎక్కబోయాను.

గోడపైన ఫెన్సింగ్ ఉండటం వల్ల చేతులు, కాళ్ళు గీరుకున్నాయి. ముఖానికి ఒకచోట గీరుకొని రక్తం చిందింది. గాయమైనా బాధను మునిపంట అదిమిపట్టి 'అల్లా... నా ప్రయత్నం విజయవంతం చెయ్' మనసులో ప్రార్థించాను.

పట్టువదలని విక్రమార్కుడిలా గోడ ఎక్కేసి క్రిందికి దూకాను. కాస్త లైటు వెలుతురు పడుతున్న ఆ స్థలంలో నాకేమి కనిపించలేదు. ప్రేమాంధ కారంలో పడ్డ గ్రుడ్డివాణ్ణి కదా!

తీరా చూస్తే నేను వేసుకొని ఉన్న హవాయి చెప్పుల్లోంచి ముళ్ళు దూసుకొని అరికాళ్ళను తీవ్రంగా బాధించాయి. మరొక్కసారి 'అల్లా...' అని నా పెదాలు ఉచ్ఛరించాయి బాధతో.

ఎండాకాలం అవటంతో మేరీ వరండాలో ఒకవైపుకు వత్తిగిలి పడుకొని ఉంది. ఎడంవైపున అయిదడుగుల దూరంలో మేరీ అన్న జాన్ గురకపెడుతున్నాడు.

నేను మేరీ మంచంవద్దకు చేరుకొని నఖశిఖ పర్యంతం తనివి తీరా చూశాను. ఓ శిల్పి తన నైపుణ్యంతో తీర్చిదిద్దాడా? అన్న ఆత్మసంతృప్తి కలిగినట్లు.

'మేలుకోవా మేరీ... నన్నేలుకోవా మరి
'చేరుకోవా నాదరి... నిన్నే కోరు నా మది....

నెమ్మది.

మనసులో పల్లవి మెదులుతుంటే తన్నెవరో స్పృశించి లేపినట్లనిపించి ప్రక్కమార్చి వెల్లకిలా సర్దుకొని పడుకొంది.

ఒక చేయి పొట్టమీద మరోచేయి నుదుట చేర్చుకొని ఉంది. మెల్లగా నుదుటిపైని చేతిని నాచేతిలో తీసుకున్నాను.

మృదువుగా ఉంది ఆమె చేయి. రెప్ప వాల్చక ఆమె కళ్ళల్లోకి చూస్తూ పెదాలతో స్పృశించాను.

పెదవి స్పర్శ తగలగానే వేయి వోల్టుల బల్బు వెలిగినట్టు మేరీ కళ్ళు మెరిశాయి. చిన్నగా నవ్వి జాన్‌వైపు తిరిగిచూసి 'రాత్రిపూట రావడానికి ఎంత ధైర్యం' అంది ఆశ్చర్యంతో.

'అరె! నీ ముఖానికి రక్తం. చేతులకు రక్తం... ఇది... ఇది' వణుకుతుంది కంఠం.

'కాంపౌండు గోడమీది ఫెన్సింగ్ గుచ్చుకొంది' అన్నాను ప్లెజంట్‌గా.

ఆ క్షణంలో నేనూహించని రీతిన కౌగిట చేర్చుకొంది. రక్తసిక్తమైన బాధని ప్రేమతో ఊరటకలుగ జేసింది.

"ఇంకెప్పుడూ ఇలా అర్ధరాత్రి పూట రాకు. నీకు గాయాలైతే నేను భరించలేను. మా అన్నయ్య అసలే కర్కోటకుడు. మీన వ్యవహారం కంటపడితే నిన్నుఏమైనా చేయగలడు.' ఆమె గాద్గదిక స్వరంతో అంటుంటే మేరీ ప్రేమలో మునిగిపోయిందని అర్థమైపోయింది.

'వెళ్ళు... వెళ్ళు... ఉదయం మాట్లాడుకుందాం' అంటూ గేటుదాకా వచ్చి గేటు తలుపుల్ని తీసి బయటకు పంపింది.

ఆమె కళ్ళల్లోకి తీక్షణంగా చూశాను. ఆమె నన్ను దగ్గరికి లాక్కొని ముద్దుపెట్టుకొంది గాయ మైన చోట. ఇక వెళ్ళక తప్పదని గ్రహించి మెల్లగా ఇంటి ముఖం పట్టాను.

అలా మన ప్రేమాయణం సాగుతున్నప్పుడు ఎవరో జాన్ చెవుల్లో వేశారు. ఆ రోజు కాలేజీ వదిలారు. స్టూడెంట్స్ అంతా తొందరగా వెళ్ళిపోతున్నారు.

నేను మాత్రం 'మేరి' కోసం మెల్లగా నడుస్తున్నాను. కాలేజీ ఆవరణ దాటగానే వీపు చెళ్ళుమని పించేలా సైకిల్ చైను షర్టు చించుకొని వీపున మోతేమో అయింది. ఒక్కసారి కాదు రెండుసార్లు అనేకసార్లు

"ఏరా ఎంతధైర్యం నీకు? నా చెల్లెల్ని ప్రేమి స్తావా?' అన్న జాన్ కీచుగొంతు కఠిన రాయిని కూడా ముక్కలు చేసినంత ఆవేశం పెల్లుబికింది.

ఆ తర్వాత ఏం జరుగుతుందో అర్థమయ్యే లోపు ఏం జరిగిందో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి వెలుతురును భరించలేకపోతున్నాను.

దేహమంతా కట్ల తో నిండిఉంది. కదుల దామంటే తీవ్రమైన గాయాల బాధ. నేనున్నది హాస్పిట ల్లోనని అప్పటిదాకా తెలిసి రాలేదు.

జాన్ నన్ను కొట్టినందుకు నిరసన తెలుపుతూ నా క్లాస్‌మేట్స్ మొత్తం కాలేజీని 'బంద్' చేయించారు.

పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. అంతా జరుగుతున్నా మేరీ ఏం చేస్తుందో - ఎక్కడుందో నన్నేమని తిట్టు కొంటుందోనని ఆలోచిస్తున్నాను.

అమ్మ బెడ్ దగ్గర స్టూల్ మీద ఏడుస్తూ కూర్చుంది. నాన్న వచ్చిపోయాడట: 'ఇంకోసారి చేయ కుండా వీడికి శాస్తి బాగానే జరిగింది' అన్నేసి పోయాడట.

తర్వాత మేరీ వచ్చింది. ఆమె ముఖంలో ఏడులోకాల్ని ఏడు సముద్రాలలో ముంచేసినట్టు గాయపడ్డ హృదయంతో చెమ్మగిల్లిన కళ్ళతో ఉంది. పెదవి విప్పి మాట్లాడలేని పరిస్థితిలో కళ్ళతో నవ్వాను. నా ప్రక్కన చోటుచూపించాను.

'నన్ను బయటికి వెళ్ళకుండా కట్టుదిట్టం చేశాడు మా అన్నయ్య. కాని నేనొచ్చే ముందు అతని పాలల్లో మత్తు మందు కలిపి ఇచ్చివచ్చాను' అంది.

నా కళ్ళు వర్షించాయి. మేరి చేతులు నా దానికి ముందు కొచ్చాయి. నా చేతులు కదల్లేదు గాని

# పరిచయం



సయ్యద్ జహీర్ అహ్మద్

పేరు : సయ్యద్ జహీర్ అహ్మద్
విద్య : బి.ఏ.
జన్మ స్థలం : ప్రొద్దుటూరు, కడప జిల్లా
నివాసం : కర్నూలు
వృత్తి : ప్రెస్ నిర్వహణ
ప్రవృత్తి : పుస్తక పఠనం, రచన చేయడం.

ఇంత వరకు వివిధ మాస,పక్ష,వార పత్రికల్లో కథలూ, కవితలూ, వ్యాసాలూ ప్రచురించబడ్డాయి.
ఆకాశవాణి రేడియో కేంద్రంలో కవితలూ, కథానికలూ ప్రసారమయ్యాయి.

-సయ్యద్ జహీర్ అహ్మద్
జై భారత్ ప్రెస్
52/73సి, పోర్ట్,
కర్నూలు - 518 001.

లైనందువల్ల. ఏడుస్తున్న మేరీని సంభ్రమాశ్చర్యాలతో 'మేరీ'ని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా హత్తుకొని కన్నీళ్ళు తుడిచింది అమ్మ.

మనసు ఒకింత కుదుట పడింది. నా క్లాస్ మేట్స్ నా కోసం బ్రెడ్ పట్టుకొచ్చారు నేనేదో అస్వస్థతకు గురియైె నట్టు. కాకపోతే గాయాలవల్ల బాధకు లోనయ్యాను.

'పోలీస్ కంప్లయింట్ వాపస్...' అప్రయత్నంగా అన్నాను.

'ఇంత గాయాలు చేసినవాణ్ణి అంత సులభంగా వదిలేద్దామంటావా?' అదేం కుదరదు కేసు పెద్దదయ్యేట్టు చేస్తాం.' కళ్ళెర్ర జేశాడు ఒకడు.

'అటుచూడు. మేరి ని... మేరి అన్న జాన్, జైల్లో ఉండిపోతే మేరి ఒంటరిదై పోతుంది.

నేను అనుకున్నట్లు పోలీస్ కంప్లయింట్ డ్రాప్ చేసుకున్నారు.

దురదృష్టం మా ఇద్దర్నీ వెంటాడింది. మతసంబంధమైన టూర్‌కెళ్ళిన మేరీ పేరెంట్స్ అప్పుడే రావడం మేరీని జాన్ స్నేహితుడికిచ్చి పెళ్ళిచేశారు.

మూలుగుతున్న నక్కమీద తాటికాయపడ్డట్టు మా నాన్న కడపలో ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో జాయినయ్యాడు.

ఉద్యోగం స్థిరపడిన నాకు మంచి మంచి సంబంధాలు వచ్చినా తిరగ్గొట్టేశాను.

నా దగ్గరకు వచ్చేటప్పుడు బస్సు యాక్సిడెంటయి 'అమ్మ' దూరమైంది. నాన్న మెంటల్ డిప్రెషన్‌కు లోనై ఆర్నెల్లు తిరక్కముందే కళ్ళు మూశాడు.

ఒంటరి వాణ్ణయ్యాను.

ఉద్యోగం నా ఏకాంతానికి ఓ కాంత అయింది. పెళ్ళి ప్రసక్తే రాలేదు. ఉద్యోగంలో బిజీ అయిన నాకు గత స్మృతులు మనోఫలకమ్మీద తొలుస్తూనే ఉన్నాయి.

ఇరవై అయిదేళ్ళు గడిచిపోయాయి. నేను చూడాలనుకున్న 'నా' మేరీ కాని మేరీని చూడలేకపోయాను.

ఇన్నాళ్ళకు నా హృదయంలో చెరగని ప్రేమకు గుర్తుగా కమలాపురం వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. మేరీ మెట్టినిల్లు కమలాపురం. ఒక్కసారి ఆమె రూపం కళ్ళలో మెదిలేసరికి కన్నీళ్ళు జలజలారాల యి.

స్మృతుల్లోంచి వాస్తవంలోకొచ్చాక ఒక స్టేషన్ లో ఆగివుంది ట్రెయిన్. మేరి మెట్టినింటి అడ్రసుకోసం వెదికాను. మేరీ అడ్రసు దొరికింది. మేరీని వాకబు చేశాను. బహుశ ఆమె అత్తగారే మో కాబోలు!

మెట్లమీద మూలుగుతూ కూర్చొనిఉంది. మేరీ ఎక్కడని అడగ్గానే 'లేదు పోయింది వాళ్ళింటికి వెళ్ళి పోయింది. ఫో...ఫో' అంది కోపంగా.

క్షణం కూడా ఆలస్యం చేయక కర్నూలుకు ప్రయాణం కట్టాను. గిప్సన్ కాలనీలో మేరీ ఇంటికి వెళ్ళాను. ఆ ఇంట్లో ఎవరు కనిపించలేదు. ఎంతో ఆశతో వచ్చిన నాకు నిరాశ నిస్పృహ ఆవరించాయి.

ఒక ముసలామె నా వైపు చూస్తూ వచ్చింది. నాకు చూపు తక్కువ అవటంచేత గుర్తించలేకపోయాను. ఆ ముసలామె గుర్తుపట్టినట్టు చిర్నవ్వు చిందించబోయి 'నువ్వు - నువ్వు' సలీంవి కదూ!' అంది.

"అవును. నువ్వు" వ్రేలు అమె వంక చూపిస్తూ మాటలు తడబడుతున్నాయి.

'మేరీ...' ఆర్ద్రంగా పిలిచాను.

'నువ్వు హాస్పిటల్లో ఉన్నప్పుడు నా పేరెంట్స్ విదేశాలనుంచి తిరిగొచ్చారు. జాన్ వాడి స్నేహితుడికిచ్చి పెళ్ళిచేయమని పట్టుబట్టడంతో నా పెళ్ళి చితిమంటల మధ్య యజ్ఞోపవీతమైంది. ఆయనగారికి నేను పన్నెండవ భార్యనట. మొదటిరాత్రి చెప్పాడు.

ఏ మగాడు చెప్పని తన చరిత్ర గురించి చెప్పుకోవడం దాన్ని ఘనకీర్తిగా భావించడం ఏ ఆడదైనా భరించగలుగుతుందా!

అతని పాత జీవితం జాన్‌కు తెలిసినట్టులేదు. తొందరపడి పెళ్ళికి ఒప్పించాడు. పైగా అతను మా కులం కూడా కాదు. పన్నెండవ భార్యగా అతని జీవితంలో ప్రవేశించాక తెలిసింది.

అతను ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నాడని, స్త్రీ కలయిక ప్రాణాంతక మని తన సపర్యలకోసం నన్ను పెళ్ళిచేసుకున్నాడు."

'పదకొండుమంది భార్యలు ఏమయ్యారు?' అడిగాడు సలీమ్.

"అతని దుష్ప్రవర్తనకు జడుసుకొని దూరమైపోయారు కొందరు. కపట వేషధారణ చూసి గొప్ప ఐశ్వర్యవంతుడని మోసపోయారు మరికొందరు." అది మేరీ.

"పదకొండు మంది భార్యలు దూరమైనా తరువాత నువ్వతన్ని ఏం చేస్తే బుద్ధొస్తుందని అనుకొన్నావు?"

'కోర్టుద్వారా విడాకుల కోసం సమన్లు పంపాను. విడాకుల తేపె నాటికి అతని మాజీ భార్య అకస్మాత్తుగా తారసపడి ఇంటికి రమ్మని ప్రేమతో పిలిచింది. కరడు గట్టిన పాషాణం కంచంలో వడ్డించిన విషం ఎవరికి తెలుసు?

అతడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. పీడవిరగడైందని అనుకున్నా మనసు మారుమూల మనోవేదన తన్నుకొచ్చింది. నిన్ను ప్రేమించిన పాశానికి అన్నయ్య చీవాట్లు పెట్టాడు.


నీకూ నాకూ మధ్య మతపరమైన భేదం అడ్డుగోడ అయింది. విడాకులు పుచ్చుకో బోతున్న విషయం తెలిసి నన్ను బంధువులు ఎవరూదరికి రానీయలేదు. నేను ఒంటరి దాన్నయిపోయాను సలీం' వణుకుతుంది కంఠం.

"నా పరిస్థితి కూడా అంతే మేరీ. అమ్మ నాన్న ఆర్నెల్ల తేడాతో యాక్సిడెంటులో పోయారు. నా జీవితంలోకి నిన్నాహ్వానించాలనుకున్న నాకు ఒంటరి తనవే మిగిలింది." అంటూ నా కథ చెప్పాను.

'సలీం నన్ను విడిచి పెట్టవు కదూ' అడుగుతోంది మేరీ.'

చిన్నగా నవ్వి, ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను.

★




కెంచు చిన్నన్న, కార్టూనిస్ట్, పోస్టుఃచిన్నమెట్‌పల్లి, మంఃకోరుట్ల, జిల్లాః కరీంనగర్.